# ఉదారత్వం



వీరాపురంలో పచ్చల పాపయ్య అనే ఓ పెద్ద రైతు వుండేవాడు. ఆ చుట్టుప్రక్కల పది గ్రామాలకి అంత మోతుబరి రైతు ఎవరూ లేరు. ఓ రోజు ఆయన ఎద్దుల్ను కొనటానికి రామాపురం సంతకి వెళ్ళాడు. అక్కడ భిక్షాటన చేస్తున్న ఓ మనిషిని పిలిచి ఇలా అన్నాడు.

"ఏరా కోటయ్యా! ఎద్దులా వుండి అడుక్కు తినకపోతే నా దగ్గర పని చేయరాదా?"

కోటయ్య తల వూపగానే, అతణ్ణి వచ్చి పనిలో చేరమని చెపుతూ, జేబులో నుంచి పది రూపాయలు తీసి, అతడి చేతిలో పెట్టాడు పాపయ్య.

ఇదంతా చూచి పాపయ్య వెంట వచ్చిన పాలేరు వీరేశం ఎంతో ఆశ్చర్య పడ్డాడు. పాపయ్య పరమ పిసినారి. ఎంత పని వున్నా, కొద్దిమందితోనే గొడ్డు చాకిరీ చేయించుకునే వాడు. పని చేసిన తర్వాత కూడా డబ్బు ఒక్కసారిగా ఇవ్వడు. అటువంటి వాడికి, పనిలో చేరక ముందే డబ్బు యిచ్చే అంత ఉదారత్వం ఎలా వచ్చిందో వీరేశంకు అంతుపట్టలేదు.

"అతణ్ణి చూస్తే పని చేసే మనిషిలా లేడు. మీరు ఏమో అతడికి ముందుగానే డబ్బు ఇచ్చేశారు!" అన్నాడు వీరేశం వినయంగా.

"కోటయ్య వూరూరు తిరిగి నా పరువు తీస్తున్నాడు! అతడు పని చేసినా చేయకపోయినా, నేను పనిలో పెట్టుకోవాలి. అప్పుడైతే నా దగ్గరే పడి వుంటాడు," అన్నాడు పాపయ్య.

అది విని, వీరేశం ఆశ్చర్యపడి, "కోటయ్య మీ పరువు తీస్తున్నాడా?" అన్నాడు

"ఔను. వీడిదీ మా యింటి పేరేనట. 'నేను పచ్చల పాపయ్యగారి వంశస్థుణ్ణి. నా పేరు పచ్చల కోటయ్య. కాలం కలిసిరాక, ఆస్తి అంతా పోయి, ఇలా అడుక్కుంటున్నాను,' అని చెపుతూ అడుక్కుంటున్నాడని తెలిసింది. చాలామంది వీడి గురించి నన్ను అడుగుతున్నారు. నా పరువు కాపాడుకోవాలంటే వీడిని అడుక్కోనివ్వకుండా చూడాలి," అంటూ ఏదో ఘనకార్యం చేసినట్లు తన మీసం సవరించుకొన్నాడు పాపయ్య.